సిద్దిపేట రైతు సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వం

–కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

సిద్దిపేట, ఏప్రిల్ 5: కాంగ్రెస్‌ది రైతు వ్యతిరేక ప్రభుత్వమని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు చేయలేదని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఆరోపించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు సత్యాగ్రహ దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు భరోసా పేరిట రైతులకు రూ.15వేలు ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతే ప్రభుత్వం ఎలాంటి పరిహారం ప్రకటించలేదన్నారు. వడగళ్లకు దెబ్బతిన్న రైతులకు పరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు రూ. 500 బోనస్, కౌలు రైతులకు సహాయం వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మోసం చేసిందన్నారు. ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ధైర్యంగా ఫిర్యాదు చేయండి

- సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటరూరల్, ఏప్రిల్ 5: మహిళలు ర్యాగింగ్,ఈవ్‌టీజింగ్‌కు గురైతే మౌనం వీడి పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ అనురాధ సూచించారు. శుక్రవారం సీపీ మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. గతనెలలో వివిధ పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలకు విశేష స్పందన వచ్చిందన్నారు. జిల్లాలోని షీటీమ్స్‌తో మహిళలు, బాలికలకు భద్రత, భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈవ్‌టీజింగ్‌పై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 46 మందిని పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించామని, వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్ల వారీగా షీటీమ్స్ పనిచేస్తున్నాయని, మహిళా పోలీస్‌స్టేషన్, స్నేహిత మహిళా కౌన్సెలింగ్, భరోసా సెంటర్లు బాధితులకు అండగా నిలుస్తున్నాయని, అవసరమైన వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. 36 మంది మహిళలకు సిద్దిపేటలోని కోటిలింగాల ఆలయ ఆవరణలోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంబ్రాయిడింగ్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్ ఎంచుకున్న వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్లేప్పుడు ఎవరైనా వేధిస్తే వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సాప్ నెంబర్ 87126 67434, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూమ్ సెల్: 87126 67100, గృహిణులు గృహహింసకు గురైతే స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ సెల్: 94946 39498 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. బాల్యవివాహం చేసినట్లు తెలిస్తే 1098కు ఫోన్‌చేసి తెలియజేయాలన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గ్రాడ్యుయేషన్ పట్టాలతో విద్యార్థులు

చేర్యాల, ఏప్రిల్ 5: పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డేను యాజమాన్యం శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా యూకేజీ, ఐదో తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ బాలకిషన్ మాట్లాడారు. కార్యక్రమంలో కింగ్స్‌న్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ అనంతరెడ్డి, లైఫ్ కోచ్ బొడ్డు వినోదకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అగ్నిగుండాల ప్రదేశాన్ని పరిశీలించిన అధికారులు

చేర్యాల, ఏప్రిల్ 5: కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో ఈనెల 7న నిర్వహించే అగ్నిగుండాల కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. కొమురవెల్లి ఎస్సై నాగరాజుతో కలిసి ఆలయ ఈవో, సిబ్బంది అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలించారు. బారికేడ్లు తదితర వాటిని పరిశీలించి అగ్నిగుండాలకు పోలీస్‌శాఖ అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిర్వహించాల్సిన బందోబస్తుపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ డీఈ రాజేశ్వర్, ఏఈ సతీశ్ పాల్గొన్నారు. కాగా, అగ్నిగుండాల కార్యక్రమ వైదిక పర్యవేక్షణకు వికారాబాద్ జిల్లా కేంపినమఠం మఠాధిపతి డాక్టర్ చెన్న బసవప్రభు మహాస్వామి రానున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి. అగ్నిగుండాల వైదక పర్యవేక్షణ బసవప్రభు మహాస్వామిజీ చేపట్టనున్నారు.

సిద్దిపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

హరీశ్‌రావు వెంటే ఉంటాం

సిద్దిపేట, ఏప్రిల్ 5: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు వెంటే ఉంటామని బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి జంగిటి నర్సింహులు, పట్టణ ఉపాధ్యక్షుడు బండల రాజు, కార్యదర్శి వీరబత్తిని నవీన్, వార్డు సీనియర్ నాయకుడు పుల్లూరు నరేశ్ అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ నాయకుడు, తెలంగాణ ప్రజల గుండె చప్పుడు, సిద్దిపేట ప్రజలకు కుటుంబ సభ్యుడిగా అండగా ఉండే నాయకుడు హరీశ్‌రావు అని గుర్తుచేశారు. సిద్దిపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన నాయకుడు హరీశ్‌రావుపై కొంతమంది విమర్శలు చేసి అధికార పార్టీలో చేరడం సిగ్గుచేటన్నారు. సిద్దిపేట అభివృద్ధే ధ్యేయంగా ఎప్పటికప్పుడు ప్రజల మధ్య ఉంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు ,పార్టీ నాయకుడు కొండం సంపత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి పి.వెంకట్రామిరెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో లవకుమార్, జక్కుల నరేశ్, శనిగరం భూమయ్య, రాజు, అంజయ్య, కొంపల నర్సింహులు, నర్సింహులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

గుర్రాలగొందిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

నారాయణరావుపేట, ఏప్రిల్ 5: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఎంపీడీవో శ్రీరాములు అన్నారు. మండలంలోని గుర్రాలగొంది, జక్కాపూర్, గోపులాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం ధర్మసాగర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఏ'గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 'బీ' గ్రేడ్ ధాన్యానికి రూ. 2,183 ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్, సీసీ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వ్యక్తులు కొనుగోలు చేస్తే చర్యలు

చేర్యాల, ఏప్రిల్ 5: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్ద ప్రైవేట్ వ్యక్తులు ధాన్యం కొనుగోలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఐకేపీ ఏపీఎం ప్రకాశం తెలిపారు. మండలంలోని ముస్త్యాల, వీరన్నపేట, చుంచనకోట, వేచరేణి, తాడూరు, చిట్యాల, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపురి, శభాష్‌గూడెం, ఆకునూరు, రాంపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఐకేపీ ఆధ్వర్యంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. సీసీ చంద్రమౌళి, ముస్త్యాల వీవో అధ్యక్షురాలు నవిత, రైతులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయం

జిల్లా వ్యాప్తంగా బాబూజగ్జీవన్‌రామ్ జయంతి

జిల్లావ్యాప్తంగా శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని జరుపుకొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమన్నారు. నేటి యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన అలుపెరగని పోరాటం చేశారని గుర్తుచేశారు. – సిద్దిపేట జిల్లానెట్‌వర్క్, ఏప్రిల్ 5

గజ్వేల్: గజ్వేల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, సంఘం నాయకులు

సిద్దిపేట అర్బన్: జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

హుస్నాబాద్‌టౌన్: మున్సిపల్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రజితావెంకన్న తదితరులు

సిద్దిపేట: బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీఎన్జీవోలు

చేర్యాల: చేర్యాలలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దూరు(ధూళిమిట్ట): జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

మిరుదొడ్డి: మిరుదొడ్డిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

ఇబ్బందులు కలుగకుండా నీటి సరఫరా

గజ్వేల్: అక్కారం సంప్‌ను సందర్శించిన ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 5: ఎండాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా అన్నారు. శుక్రవారం కుకునూరుపల్లి మండలంలోని తిప్పారంలోని రా వాటర్ పంప్ హౌస్‌తో పాటు మంగోల్‌లోని వాటర్ ట్రీట్మెంట్‌ప్లాంట్‌లోని ఫిల్టర్ హౌస్‌ను కలెక్టర్ ఎం.మనుచౌదరితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకూడదని ప్రభుత్వం తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు జిల్లా కలెక్టర్లను ఆదేశించామన్నారు.కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, సీఈ విజయ్ ప్రకాశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ శ్రీనివాసచారి, కార్యనిర్వాహక ఇంజినీర్ రాజయ్య, అధికారులు పాల్గొన్నారు.

అక్కారం సంప్‌హౌజ్ సందర్శన

గజ్వేల్, ఏప్రిల్ 5: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించామని ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా అన్నారు. శుక్రవారం మండలంలోని అక్కారం సమీపంలోని 40ఎంఎల్ సంప్, ఇంటర్మీడియేటరీ పంపింగ్ స్టేషన్‌ను కలెక్టర్ మనుచౌదరితో కలిసి ఆయన సందర్శించి నీటి లభ్యతను పరిశీలించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ విజయ్‌ప్రకాశ్, ఎస్‌ఈ శ్రీనివాస్‌చారి, ఈఈ రాజయ్య, డీఈ నాగార్జున పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 5: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మద్దూరు మండల కేంద్రంలోని తాజ్‌మహల్ గార్డెన్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శౌకత్‌అలీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కంఠారెడ్డి జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాచకొండ ఉప్పలయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తాజ్‌మహ్మద్, మాజీ ఉపసర్పంచ్ అరీఫ్, నాయకులు రాగుల శ్రీనివాస్‌రెడ్డి, గద్దల మహేందర్, నవీద్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న సందీప్ కుమార్ సుల్తానియా

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 5: కలెక్టరేట్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో తాగునీటి సరఫరాపై రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలెప్‌మెంట్, ఆర్‌డబ్ల్యూఎస్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గిపోతాయని.. ఈ సమయంలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు 24 గంటలలోపు నీటిని పునరుద్ధరించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మనుచౌదరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భావిభారత పౌరులుగా ఎదగాలి

విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి

సిద్దిపేట టౌన్, ఏప్రిల్ 5: విద్యార్థులు భావి భారత పౌరులుగా ఎదగాలని ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి అన్నారు. సిద్దిపేటలో గురువారం రాత్రి రావుస్ మై టెక్నో స్కూల్ యానివల్ డే జరిగింది. అంతకు ముందు విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నది. ఆటపాటతో అలరించిన చిన్నారులకు రావుస్ గ్రూప్స్ చైర్మన్ ప్రభాకర్‌రావు,సీఏ ఉపేందర్‌తో కలిసి ఎమ్మెల్సీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో నిధిన్‌రావు, డాక్టర్ మురళీకృష్ణ, న్యాయవాది శివాజీగణేశ్, ప్రిన్సిపాల్ తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కిశోర్‌కు నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్

సిద్దిపేట కమాన్, ఏప్రిల్ 5: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ దళిత పరిరక్షణ సమితి (టీడీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు దబ్బెట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం టీడీపీఎస్ జిల్లా కన్వీనర్‌గా పెర్క కిశోర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులకు అన్ని రంగాల్లో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత హక్కుల సాధన కోసమే టీడీపీఎస్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సందీప్ కుమార్, బాలరాజు, శామ్యూల్, సురేశ్, మహేందర్ పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి పరామర్శ

మృతుడి కుటుంబీకులను పరామర్శిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్

గజ్వేల్, ఏప్రిల్ 5: మండలంలోని కోమటిబండ గ్రామానికి చెందిన రవీందర్ ఇటీవల ఆకస్మికంగా మృతిచెందాడు. శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పరామర్శించి సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. గ్రామానికి చెందిన ఉబ్బని ఆంజనేయులు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆయన్ని పరామర్శించారు. గ్రామానికి చెందిన ప్రశాంత్ రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కొలుకున్న అతన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాల రమేశ్‌గౌడ్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు, మాజీ సర్పంచ్ శేఖర్, గ్రామ శాఖ అధ్యక్షుడు భాస్కర్, బురాన్, నిజామొద్దీన్ ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ రైతు దీక్ష

హుస్నాబాద్, ఏప్రిల్ 5: హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయం ఆవరణలో శనివారం నియోజకవర్గంలోని రైతు సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షా కార్యక్రమం ఉంటుందని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సరైన మార్గంలో నడిపించేది సాహిత్యమే

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 5 : సాహిత్యాన్ని మానవీయ విలువల్ని పెంపొందించే సాధనంగా ఉపకరించాలని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో స్థానిక శివానుభవ మంటపంలో శుక్రవారం ఉగాది కవి సమ్మేళనం జరిగింది. కవి సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 60 మంది కవులు కవిత్వపఠనం చేశారు. అంతకుముందు కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు వేముగంటి నర్సింహచార్యులు ఉగాది పురస్కారాలు అందజేశారు.కార్యక్రమంలో కవులు గఫూర్ శిక్షక్, మహిపాల్, మహేందర్, రాజు, ఉమాశంకర్, అశోక్‌రాజు, సుధాకర్, సువర్ణ, పద్మ, బాల సరస్వతి, లక్ష్మి, తిరుపలి,శ్రీధర్ పాల్గొన్నారు.

బీజేపీని చిత్తుగా ఓడించాలి

చేర్యాల, ఏప్రిల్ 5: త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ సంపదను ప్రైవేటీకరణ పేరుతో బడా పెట్టుబడిదారులకు అప్పగిస్తూ ప్రజలపై అనేక భారాలు మోపుతున్న బీజేపీని ఓడించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలు దేశ భవిష్యత్‌ను మార్చే విషయంలో కీలకం కానున్నాయన్నారు. సమావేశంలో నాయకులు గొర్రె శ్రీనివాస్, సందబోయిన ఎల్లయ్య, కొంగరి వెంకట్‌మావో, మల్కనీ ఎల్లయ్య, నాగపురి కనకయ్య, దర్శనం రమేశ్, రేపాక కుమార్, కరీం పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్

తొగుట, ఏప్రిల్ 5: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల కపటప్రేమ చూపుతోందని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నామమాత్రంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రైతులు పొద్దుతిరుగుడు ధాన్యం తీసుకువచ్చినప్పటికీ కొనుగోలు చేయడంలో అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు గొనెసంచులు కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 5: గజ్వేల్‌కు చెందిన దళిత న్యాయవాది బత్తుల రాజుపై దాడిచేసిన ప్రభుత్వ న్యాయవాది అశోక్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత ఉద్యోగుల ఐక్య వేదిక నాయకులు ఎల్లయ్య, సత్యనారాయణ, ఎర్ర మల్లేశం కోరారు. శుక్రవారం గజ్వేల్ ఏసీపీ కార్యాలయంలో వినతిపత్రం అందజేసి వారు మాట్లాడారు. దళిత న్యాయవాది బత్తుల రాజుకు చెందిన ప్లాట్‌ను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని మాట్లాడుకుందామని పిలిచి అశోక్‌రెడ్డి తన అనుచరులతో దాడికి పాల్పడడం సిగ్గుచేటన్నారు. దాడి చేసిన అశోక్‌రెడ్డి తన అనుచరులపై కేసు నమోదు చేయాలని, లేనిపక్షంలో జాతీయ, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు ఫిర్యాదు చేస్తామన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా మల్లేశం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 5: కాంగ్రెస్ మద్దూరు మండల అధ్యక్షుడిగా గాగిళ్లాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేక మల్లేశాన్ని నియమిస్తూ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్లేశం మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించబడిన మేక మల్లేశాన్ని పలువురు నాయకులు, కార్యకర్తలు ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 5 : విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని సస్పెన్షన్ చేస్తూ శుక్రవారం డీఈవో శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 26న కొండపాక మండలంలోని దుద్దెడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థినిపై ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వహిస్తున్న బాకీ చంద్రభాను అసభ్యకరంగా ప్రవర్తించాడని ఆ విద్యార్థిని పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ లక్ష్మికి ఫిర్యాదు చేసింది. మార్చి 27న డీఈవో ఆదేశాలతో విచారణ చేపట్టి విద్యార్థినితో పాటు పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్ లక్ష్మి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి డీఈవోకు నివేదిక అందజేశారు. శుక్రవారం సదరు ఉపాధ్యాయుడిని సస్పెన్షన్ చేస్తున్నట్లు డీఈవో ఆదేశాలు జారీ చేశారు.

ముగ్గురికి రిమాండ్

కొండపాక(కుకునూరుపల్లి), ఏప్రిల్ 5: కొండపాకకు చెందిన రేపార చందుపై గురువారం హత్యాయత్నం చేసిన అదే గ్రామానికి చెందిన రేపాక అశోక్, రేపాక నవీన్, రేపాక సంతోష్‌కుమార్‌ను శుక్రవారం కుకునూరుపల్లి ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారించి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పేదింటి వధువుకు పుస్తెమట్టెలు అందజేత

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 5: మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌కు చెందిన భాషమైన కనకవ్వ–రమేశ్ కూతురు భాగ్యలక్ష్మి వివాహానికి రేబర్తి పీఏసీఎస్ మాజీ చైర్మన్ కామిడి రమేశ్‌రెడ్డి శుక్రవారం పుస్తెమట్టెలు అందజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశం, ఇట్టబోయిన కనకచంద్రం, బండి బాలయ్య, బండి గణేశ్, చింతల శ్రీనివాస్, నారదాసు నర్సయ్య, మేక కిష్టయ్య, మల్లేశం పాల్గొన్నారు.